క్లుప్తంగా

కాగుపాడు సర్పంచ్‌కి వాసుబాబు పరామర్శ



కాగుపాడు సర్పంచి సుధీష్ణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: కాగుపాడు సర్పంచి కడియాల సుధీష్ణ చిట్టిబాబులను శనివారం మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, వైఎస్సార్‌ సీపీ మండల నాయకులతో కలిసి పరామర్శించారు. ఇటీవల సుధీష్ణ అత్త కడియాల వరలక్ష్మి కాంతం మృతి చెందడంతో వాసుబాబు సంతాపం తెలిపి సుధీష్ణ, చిట్టిబాబులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, పార్టీ నాయకులు మరడ మంగరావు, యెలిశెట్టి పాపారావు బాబ్జి, పి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉప్పగూడెంలో విగ్రహాల ప్రతిష్ఠ

దెందులూరు: ఉప్పుగూడెంలోని శ్రీకోదండ రామాలయంలో ఆదివారం ఉదయం 8.34 గంటలకు శ్రీ హనుమ సీతారామ లక్ష్మణ స్వామి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కోదండ రామాలయ కమిటీ సభ్యులు బ్రహ్మశ్రీ ఎల్‌ఎస్‌వీశాస్త్రి తెలిపారు. విగ్రహాల ప్రతిష్ఠ, పూజలు, అభిషేకాలు అనంతరం ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

దెందులూరు: గాలాయగూడెం కోఆపరేటివ్‌ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి దామా వెంకటేశ్వర్లు కోరారు. గాలాయగూడెంలో తహసీల్దార్‌ బీ.సుమతి, దెందులూరు మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్‌ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ఉంగుటూరు: బాదంపూడిలో భక్తాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శనివారం మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శంకుస్థాపన చేశారు. వాసుబాబు వెంట వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, పార్టీ నాయకులు పుప్పాలగోపి, పి.బాలకృష్ణ, దాసరి అప్పన్న, రామకృష్ణ, మాజీ సర్పంచి వై.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామికి పూజలు



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

దెందులూరు: గాలాయగూడెంలోని శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ అయ్యప్ప స్వామి జయంతోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మహా అన్నసమారాధన నిర్వహించారు.

సువార్త మహోత్సవాల కరపత్రాల విడుదల



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రేయర్‌ మినిస్ట్రీస్‌ సిస్టర్‌ గ్రేస్‌

దెందులూరు: ఈనెల 22, 23, 24 తేదీల్లో యాదవ నగర్‌ ఝురూషలేము ప్రేయర్‌ మినిస్ట్రీస్‌ ఆధ్వర్యంలో దెందులూరులో రక్షణ సువార్త మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రేయర్‌ మినిస్ట్రీస్‌ సిస్టర్‌ గ్రేస్‌ తెలిపారు. సువార్త మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం సిస్టర్‌ గ్రేస్‌ ఆవిష్కరించారు. దెందులూరుతో పాటు సమీప మండలాల్లోని భక్తులు మూడు రోజుల పాటు జరిగే మహోత్సవంలో పాల్గొని దేవుని దీవెనలు పొందాలని కోరారు.

వ్యక్తికి గాయాలు

భీమడోలు: వ్యాన్‌ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల ప్రకారం ఉంగుటూరు మండలం యర్రమిల్లిపాడుకు చెందిన నెరుసు శ్రీనివాసరావు గుండుగొలను నుంచి ఉంగుటూరు వస్తుండగా జాతీయ రహదారి పూళ్ల వద్ద వెనుక నుంచి వ్యాన్‌ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. ఆతడిని చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి నేషనల్‌ హైవే అంబులెన్స్‌ సిబ్బంది తరలించారు.

వేసవిలో పొంచి ఉన్న నీటి ఎద్దడి

- గ్రామాల్లో ఇంకా నిండని మంచినీటి చెరువులు
- పూర్తి స్థాయిలో నీరు చేరని కొల్లేరు గ్రామాలు



గుండుగొలనులో మురికిగా ఉన్న తాగునీరు



పసర్లు పట్టిన ఓ చెరువులోని నీరు



ఎంఎం పురంలో పూర్తి స్థాయిలో నీరు నిండని దృశ్యం

భీమడోలు: ఈనెల 15వ తేదీన గోదావరి కాలువ మూసివేయనున్న నేపథ్యంలో గుండుగొలను ఇరిగేషన్‌ సెక్షన్‌ శాఖ పరిధిలో మంచినీరు, పశువుల చెరువులను నీటితో నింపుకోవాలంటూ లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేసింది. రెండు, మూడు రోజులు మాత్రమే గడువు ఉండడం, ఇంకా చెరువుల్లో పూర్తి స్థాయిలో నీరు చేరకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వంతుల వారీ విధానంలో సాగునీటి ఎద్దడి నేపథ్యంలో పలు చోట్ల శివారు పంట పొలాలకు దాళ్వా సాగు నీటిని అందిస్తుండడంతో మంచినీటి చెరువులను నీటితో నింపుకోలేని పరిస్థితి ఏర్పడింది. గోదావరి కాలువను ఆనుకున్న గ్రామాల్లోని చెరువుల్లో నీటితో నింపుతున్నా కొల్లేరు శివారు గ్రామాల్లో మంచినీటి చెరువులు నిండని పరిస్థితి ఏర్పడింది. మండలంలోని మంచినీటి చెరువులు 50శాతానికి పైగా ఇంకా నిండని పరిస్థితి ఏర్పడింది. కొల్లేరు గ్రామాల్లో మంచినీటి చెరువుల్లో నీరు అడుగంటాయి. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితులు ఎదురవుతాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మరో పది రోజుల పాటు నీటిని విడుదల చేయాలని పంచాయతీలు, ప్రజలు కోరుతున్నారు.

వార్షిక పనుల కోసం..

గుండుగొలను సెక్షన్‌ పరిధిలో గోదావరి కాలువపై ఆధారపడి చెరువులను వెంటనే నింపుకోవాలని ఇరిగేషన్‌ అధికారులు ఆదేశించారు. భీమడోలు, దెందులూరు, ఏలూరు మండలాల్లోని గ్రామాల్లోని మంచినీటి, పశువులు, ఆకుమళ్ల చెరువులను నింపుకోవాలని సర్క్యులర్‌ జారీ చేశారు. అదే విధంగా కాల్వల వార్షిక పనుల నిమిత్తం ఈ ఏడాది ఏప్రిల్‌ 15వ తేదీన గోదావరి కాలువను మూసివేస్తామని అందులో పేర్కొన్నారు. ప్రతి ఏటా ఏప్రిల్‌ నెలాఖరు వరకు నీటిని విడుదల చేసేవారు. మండలంలోని కాల్వను అనుకుని ఉన్న పూళ్ల, కురెళ్లగూడెం, పాతూరు, గుండుగొలను, లక్ష్మీపురం, ఆగడాలలంక, చెట్టున్నపాడు చెరువులను నీటితో నింపుకోవాలని వారు పేర్కొన్నారు.

వేసవిలో తాగునీటి అవసరాలు తీర్చలేని చెరువులు

వేసవి రెండు నెలల పాటు ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే స్థాయిలో మంచినీటి చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం లేదు. 30 రోజుల తర్వాత గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే పరిస్థితులు తలెత్తనున్నాయని ప్రజలు వాపోతున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటిని అందించాల్సి ఉండగా ఇప్పటికే ప్రైవేటు వాటర్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. కొల్లేరు గ్రామాల్లోని చెర్వుల్లోని నీరు తాగడానికి నిరుపయోగకరంగా మారాయి, వాడకానికి తప్ప తాగడానికి పనిచేయని పరిస్థితి ఏర్పడింది. దీనితో ప్రతి ఇంటికి 20 లీటర్ల టిన్నును రూ.20 కొనుగోలు చేసుకుని తాగుతున్నారు. వేసవిలో తాగునీటి అవసరాలు మరింత పెరగనున్నాయని ప్రజలు చెబుతున్నారు. కొల్లేరు చుట్టూ నీరున్నా తాగునీటికి నిరుపయోగకరంగా ఉంటాయని వారు వాపోతున్నారు.

వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో...

వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో కొల్లేరు వాసులకు మంచినీటి అందించేందుకు అవసరమైన జల జీవన్‌ ప్రాజెక్టు మంజూరైంది. అయితే ఆగడాల లంక చెక్‌పోస్టు వద్ద చెర్వును తవ్వి అక్కడ నుంచి కొల్లేరు వాసులకు మంచినీటిని ఇవ్వాలని భావించారు. కొల్లేరు ప్రాంతం కావడంతో ఆటవీశాఖ, పర్యావరణ శాఖల నుంచి అనుమతులు రాకపోవడంతో ఆ ప్రాజెక్టును నిలుపుదల చేశారు. ఆ ప్రాజెక్టు నుంచి గుండుగొలనులో చెర్వును తవ్వి కొల్లేరు గ్రామాలకు తాగునీటిని ఇవ్వాలని కొల్లేరు వాసులు కోరుతున్నారు.

దుర్వాసనగా పంచాయతీ నీరు

గుండుగొలను గ్రామస్తులకు పంచాయతీ అందిస్తున్న తాగునీరు నిరుపయోగకరంగా మారాయి. పంచాయతీ సరఫరా చేస్తున్న నీరు దుర్వాసన కొడుతుంది. చెరువు చుట్టూ అపరిశుభ్రమైన వాతావరణం నెలకొంది. ఈ నీటిని తాగి వైరల్‌ జ్వరాలు, విరోచనాలు, డెంగీ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ విషయాన్ని జిల్లా, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. – వగ్వాల భాస్కర్, మాజీ ఎఎంసీ చైర్మన్, గుండుగొలను

చర్యలు చేపట్టాం

తాగునీటి సమస్యలు తలెత్తకుండా మండలంలో అన్ని చర్యలు చేపట్టాం. ఇప్పటికే మోటార్లు పెట్టి నీటిని తోడుతున్నారు. పసర్ల పట్టిన చెరువుల్లోని నీటిలో పటిమ, బ్లీచింగ్‌లను చల్లిస్తున్నాం. కొల్లేరు గ్రామాలైన ఆగడాలలంకలో చెర్వును నింపాం. చెట్టున్నపాడు, మల్లవరం చెర్వుల్లో సోమవారం నుంచి చెరువు నింపుతాం. గోదావరి కాల్వకు ఈనెల 20వ తేదీ వరకు నీటిని విడుదల చేస్తారు. – పి.సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ, భీమడోలు

సత్తా చాటిన గురుకుల బాలికలు



ఎం.హేమవతి, పోలసానిపల్లి (ఎంపీసీ - 941)



జి.శరణ్య, పోలసానిపల్లి (బైసీపీ - 974)



కుసుమాంజలి ఒకేషనల్ - 475



ఎం శశిప్రియ, పెదపాడు 972 మార్కులు



డీ ఇందుశ్రీ, పెదపాడు 972 మార్కులు



కె రవితేజ, పెదపాడు 958 మార్కులు



కె కుసుమ దుర్గ, పెదపాడు 948 మార్కులు

భీమడోలు: ఇంటర్‌ పరీక్షా ఫలితాల్లో పోలసానిపల్లి గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం 66 మంది పరీక్షలు రాయగా 64 మంది ఉత్తీర్ణులై 97 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారని, జూనియర్‌ ఇంటర్‌లో 77 మందికి గాను 64 మంది ఉత్తీర్ణులై 83శాతం ఉత్తీర్ణత శాతం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్‌ వి.వెంకట రమణ తెలిపారు. సీనియర్‌ ఇంటర్‌ ఎంపీసీలో 30 మందికి గాను 29 మంది, బైపీసీలో 36 మందికి గాను 35 ఉత్తీర్ణులయ్యారన్నారు. సీనియర్‌ ఇంటర్‌ ఎంపీసీలో ఎం.హేమావతి 941 మార్కులు, బైసీపీలో జి.శరణ్య 974 మార్కులు సాధించారన్నారు. జూనియర్‌ ఇంటర్‌ ఎంపీసీలో 470 మార్కులకు గాను 435 మార్కులు, బైసీపీ 440 మార్కులకు గాను 425 మార్కులు సాధించారని ఆమె పేర్కొన్నారు. వారిని ప్రిన్సిపాల్‌ ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

- భీమడోలు శ్రీవేంకటేశ్వర జూనియర్‌ కళాశాలలోని ప్రథమ సంవత్సరం 45 శాతం, ద్వితీయ సంవత్సరం 63 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల కరస్పాండెంటెంట్, ద్వారకాతిరుమల దేవస్థానం ఈవో ఎన్‌వీఎస్‌ మూర్తి తెలిపారు.
- భీమడోలు మాంటిస్సోరి విద్యాసంస్థల సొసైటీకి చెందిన ఒకేషనల్‌ కోర్సు విద్యార్థినులు ఇంటర్‌ ఫలితాల్లో ప్రతిభ చాటారని కరస్పాండెంటెంట్‌ కె.ప్రేమ్‌కుమార్‌ తెలిపారు. జూనియర్‌ ఇంటర్‌ ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో ఎం.కుసుమాంజలిదేవి 500 మార్కులకు గాను 475, ఎంఎల్‌టీ విభాగంలో సీహెచ్‌ నవ్య 453 మార్కులు సాధించారన్నారు. జూనియర్‌ ఇంటర్‌ బైసీపీలో ఎస్‌.లూర్దు సంజన 440 మార్కులకు గాను 400 మార్కులు, సీనియర్‌ బైసీపీ విభాగంలో కె.శ్యామల వెయ్యి మార్కులకు గాను 886 మార్కులతో కళాశాల ప్రథమ స్థానం సాధించారని తెలిపారు.

గణపవరంలో 51 శాతం ఉత్తీర్ణత

గణపవరం: ఇంటర్‌ ఫలితాల్లో గణపవరం ప్రభుత్వ జూనియర్‌కాలేజి విద్యార్థులు 51 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్‌ శ్రీనివాసగౌడ్‌ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో సీఈసీలో బి.భవ్య 894 మార్కులు, ఎంపీసీలో జ్యోతి వరలక్ష్మి 840 మార్కులు సాధించారన్నారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో జి.ప్రసన్నలక్ష్మి 448 మార్కులు, హెచ్‌ఈసీ గ్రూపులో ఎ.నిఖిల 412 మార్కులు సాధించారని తెలిపారు.

పిప్పరలో 98 శాతం ఉత్తీర్ణత

పిప్పర జూనియర్‌ కాలేజి విద్యార్థులు ఇంటర్‌లో 98 శాతం ఉత్తీర్ణత శాతం సాధించినట్లు చైర్మన్‌ జి.సుధీర్‌కుమార్‌రాజు తెలిపారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో ఆర్‌.అనసూయ 983 మార్కులు, బైపీసీలో జి.పూజిత 941 మార్కులు సాధించారన్నారు. మొదటి సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో సీహెచ్‌ మెహర్‌ గాయత్రి 453 మార్కులు, బైపీసీలో ఎ.సుజాత 422 మార్కులు సాధించారని తెలిపారు.

- చాణక్య జూనియర్‌ కాలేజిలో ద్వితీయ సంవత్సర ఎంపీసీ విద్యార్థిని బొబ్బిలి పార్వతి 986 మార్కులు, ప్రథమ సంవత్సరంలో పుప్పాలభవాని 470 మార్కులు సాధించినట్లు కాలేజి ప్రిన్సిపాల్‌ అడపా సూరిబాబు తెలిపారు.

పెదపాడు విద్యార్థుల జయకేతనం

పెదపాడు: ఇంటర్‌ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 972 మార్కులతో ఎం శశిప్రియ, డీ ఇందుశ్రీ తొలి రెండు స్థానాలు సాధించగా కె.రవితేజ 958 మార్కులతో తృతయ స్థానం సాధించాడు. 948 మార్కులతో కె కుసుమ దుర్గ నాలుగో స్థానం సాధించింది. విద్యార్థులను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌, అధ్యాపకులు అభినందించారు. మొదటి సంవత్సరం ఎంపీటీసీలో డీ ముత్తయ్య 450 మార్కులు, ఎం.చరణ్‌తేజ 423 మార్కులు సాధించారన్నారు. అలాగే అంబేద్కర్‌ గురుకుల పాఠశాల వట్లూరులో మొదటి సంవత్సరంలో 93 శాతం, రెండో సంత్సరంలో 99 శాతం ఉత్తీర్ణత సాధించారు.

బాలల భవితకు భరోసా

- 'పోషణ్‌బీ – పఢాయిబీ' పథకంతో చిన్నారుల ప్రగతి
- పథకం అమలుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ
- ప్రీ స్కూళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి



పిల్లలకు ఆటపాటలతో విద్యను నేర్పుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దెందులూరు: బాలల భవితకు కేంద్ర ప్రభుత్వం మరో పథకానికి శ్రీకారం చుట్టింది. భావి భారత విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్న లక్ష్యంతో పోషణ్‌బీ – పఢాయిబీ పథకం అమలు చేస్తుంది. ముఖ్యంగా చిన్నారులు తొలి అడుగులు వేసే అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి సారించింది. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. చిన్నారులకు విద్యతో పాటుగా ఆరోగ్య సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పోషణ్‌బీ – పఢాయిబీ పథకంపై అవగాహన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. బాల్య సంరక్షణ విద్య (ఎర్లీ చైల్డ్‌వుడ్‌ కేర్‌ ఎడ్యుకేషన్‌ ఈసీసీఈ)పై మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ బాధ్యతలను నేషనల్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ పబ్లిక్‌ కోఆపరేషన్‌ అండ్‌ చైల్డ్‌ డెవలప్‌మెంట్‌ (ఎన్‌ఐపీసీసీడీ)కి అప్పగించారు. దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు, పెదపాడు, పెదవేగి మూడు మండలాల్లో 245 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.

ఆటపాటలతో కూడిన విద్య

ఐసీడీఎస్‌ ప్రాజెక్టు పరిధిలో 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలు 1775 మంది ఉన్నారు. విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్య అందించడంతో పాటు వారి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్‌బీ – పఢాయిబీ అమలు చేస్తున్నారు. నూతన విద్యా విధానం అనుసరించి అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యతతో కూడిన పౌష్టికాహారం, మౌలిక సదుపాయాలు, ఆట పరికరాలను సమకూరుస్తూ శిక్షణ పొందిన కార్యకర్తలతో ఈసీసీఈ విధానంలో అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ



– పోషణ్‌బీ–పఢాయిబీ కార్యక్రమం అమలుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు బాల్య సంరక్షణ విద్య, ఈసీసీఈపై శిక్షణ ఇచ్చాం. పిల్లలకు విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కల్పించడమే ముఖ్య లక్ష్యంగా కృషి చేస్తున్నాం.
చిట్టెమ్మ, దెందులూరు సెక్టార్‌ సూపర్‌వైజర్‌

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



చిన్నారులకు పౌష్టికాహార లోపాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పోషణ్‌బీ –పఢాయిబీ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమైంది. ఆరు రోజుల శిక్షణ అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా కార్యక్రమం అమలుకు కృషి చేస్తున్నాం.
– సునీల్‌ రాజశేఖర్, అడిషనల్‌ సీడీపీఓ, పెదపాడు ప్రాజెక్టు

ఇంధనం ధరలు తగ్గించాలి

దెందులూరు: పెంచిన ఇంధనం ధరలను తక్షణమే తగ్గించాలని వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యదర్శి దేవదాస్‌ ప్రేమ్‌ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శనివారం ఏలూరు రూరల్‌ మండలం మానూరులో విలేకరులతో ఆయన మాట్లాడారు. పెంచిన ఇంధనం ధరలు ప్రజలకు భారంగా మారాయని తెలిపారు. ప్రజా రంజక పాలన చేస్తామన్న ప్రభుత్వాలు ప్రజలు నడ్డి విడిచేలా వారిపై అధిక భారం మోపేలా వారి జీవన విధానం కొంగతీసేలా పాలన సాగిస్తున్నారని ఈ విధానం ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంధనం ధరలు తగ్గించాలన్నారు.

వక్ఫ్‌ బోర్డ్‌ సవరణ బిల్లు అమలును నిలిపివేయాలి

చింతలపూడి: వక్ఫ్‌ బోర్డ్‌ సవరణ బిల్లు అమలును నిలిపివేయాలని డిమాండ్‌ చేస్తూ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో వక్ఫ్‌ బోర్డ్‌ 2025 ప్రతులన దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి తోర్లపాటి బాబు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలపై దాడులు చేస్తూ రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీతో మాట్లాడి వక్ఫ్‌ బోర్డ్‌ 2025 అమలను నిలిపివేయడానికి ప్రయత్నం చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య సహాయ కార్యదర్శి దొంతా కృష్ణ, కమిటీ సభ్యులు ఎస్కే కాలేషా మోర్త లక్ష్మణరావు, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

కుక్కునూరు: వక్ఫ్‌ చట్టానికి కేంద్ర ప్రభుత్వం సవరణ చేయడాన్ని నిరసిస్తూ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ముస్లింలు కుక్కునూరు ప్రధాన రహదారిపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుంచి ముస్లిం మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. కేంద్రం వక్ఫ్‌ ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. నాయకులు కొన్నె లక్ష్మయ్య, కురాకుల బాబురావు, నకిరికంటి నాగరాజు, ముస్లింలు పాల్గొన్నారు.

వరుస చోరీలతో ప్రజల్లో ఆందోళన

పెదపాడు: మండలంలోని వసంతవాడ గ్రామంలో వరుస చోరీలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలోని సుగ్రీవ లింగేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. శివాలయంలో తాళాలు గెడను పగులకొట్టి ఆలయంలోని నగదును దోచుకెళ్లారు. ఆలయ అర్చకుడు ఎల్‌ఏకే శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే పెద్ద చెరువు గట్టు వద్ద నాయీబ్రాహ్మణ వీధిలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద రెండు సార్లు చోరీ జరిగింది. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గతంలో పలు ఆలయాల చోరీ చేసి నగదు దోచుకెళ్లిన ఘటనలు ఉన్నాయని స్థానికులు పేర్కొన్నారు. చోరీ నివారణకు రాత్రి సమయంలో పోలీసులు గస్తీ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



కేశవరంలో రాగిజావ తాగుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

గణపవరం: మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలని మెనూ ప్రకారం వంట చేయాలని, రాగిజావ నిర్ణీత రోజుల్లో తప్పకుండా పిల్లలకు ఇవ్వాలని డీఈవో వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన గణపవరం మండలం కేశవరం, అప్పనపేట, మల్లపరాజుపేట గ్రామాల్లోని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. వంటలు నాణ్యంగా ఉండాలని నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. రాగి జావ తాగుతున్న విద్యార్థులను జావ నాణ్యతపై ప్రశ్నించారు. వారంలో మూడు రోజులు రాగిజావ ఇస్తున్నారా, లేదా అన్న విషయం ఆరా తీశారు. విద్యార్థులంతా తప్పనిసరిగా రాగి జావ తాగాలని, దీనివల్ల రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉంటారని విద్యార్థులకు సూచించారు. వార్షిక పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఎంఈవో గొర్రెల బాలయ్య ఉపాధ్యాయులు ఉన్నారు.

వైఎస్సార్‌ సీపీ నేతల హర్షం

దెందులూరు: వైఎస్సార్‌సీపీ పొలిటికల్‌ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు నియమితులు కావడం పట్ల ఆయన స్వగ్రామం కొవ్వలి, ఏలూరు జిల్లాలో హర్షం వ్యక్తం అవుతుంది. బాబూరావు నియామకంపై పార్టీ సీనియర్‌ నేత ఫారెస్ట్‌ కార్పొరేషన్‌ రాష్ట్ర మాజీ డైరెక్టర్‌ పల్లెం ప్రసాద్, పార్టీ ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు తేర ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కాటి సుధాకర్, డీ. ప్రేమ్‌ బాబు, గొల్ల కిరణ్, వీరస్వామి హర్షం వ్యక్తం చేశారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో.. భార్యాభర్తలకు గాయాలు

భీమడోలు: ఆటో ఢీకొనడంతో బైక్‌పై వస్తున్న భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల ప్రకారం భీమడోలు మానస స్కూలు రోడ్డులోని అన్నపనేని శ్రీనివాసరావు, ఆతని భార్య బైక్‌పై ద్వారకాతిరుమల మండలం గొల్లగూడెంలోని తమ కుమార్తెను చూసేందుకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా పోలసానిపల్లి పంచాయతీ శివారు ఆంజనేయనగరం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి ఓ ట్రక్‌ ఆటో బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై వస్తున్న భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వైద్యం కోసం ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎస్సై వై.సుధాకర్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం సహాయ నిధి అందజేత

ఉంగుటూరు: సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద లబ్ధిదారులకు అందజేశారు. 25 మంది లబ్ధిదారులకు రూ.17 లక్షల చెక్కులను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌ దొంగను పట్టుకున్న భక్తుడు

ద్వారకాతిరుమల: భక్తుల రద్దీని పురస్కరించుకుని స్థానిక కొత్త బస్టాండ్‌లో సెల్‌ఫోన్‌ దొంగలు శనివారం రెచ్చిపోయారు. ఈ క్రమంలో సెల్‌ఫోన్‌ దొంగను ఓ భక్తుడు పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. స్థానికుల కథనం ప్రకారం. పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం, ముప్పర్తిపాడుకు చెందిన గుడిమెట్ల వెంకటరెడ్డి అనే భక్తుడు తన తల్లిదండ్రులతో కలసి శ్రీవారి క్షేత్రాన్ని సందర్శించారు. స్వామివారి దర్శనానంతరం స్వగ్రామానికి తిరుగుప్రయాణం అయ్యే క్రమంలో కొత్త బస్టాండ్‌లో నరసాపురం బస్సు ఎక్కారు. కొంత దూరం వెళ్లిన తరువాత వెంకటరెడ్డి తన జేబులో సెల్‌ఫోన్‌ లేకపోవడాన్ని గుర్తించాడు. వెంటనే ద్వారకాతిరుమల బస్టాండ్‌కు చేరుకుని సెల్‌ఫోన్‌ కోసం వెతకడం మొదలు పెట్టాడు. ఆ సమయంలో బస్సు ఎక్కుతున్న మరో భక్తుడి జేబులోని సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించేందుకు ప్రయత్నించడాన్ని గమనించాడు. వెంటనే వెంకటరెడ్డి ఆ వ్యక్తిని పట్టుకుని, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు.